క్లుప్తంగా

ముగిసిన హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు



దస్తగిరి స్వామికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆళ్లగడ్డ: హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. చాగలమర్రి మండలం పెద్ద వంగళి గ్రామంలో వెలసిన హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచి దర్గా వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

చాగలమర్రి మండలం పెద్దవంగళి గ్రామంలో హజరత్ దస్తగిరి స్వామి ఉరసు సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ముల్లా లాలూసాహెబ్, సర్పంచ్ బంగారు షరీఫ్ ఉన్నారు.

వడ్డీ రహిత రుణాల పంపిణీ



వడ్డీ రహిత రుణాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో వడ్డీ రహిత రుణాలను సోమవారం కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాఖా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ 11 మందికి రూ.6.20 లక్షలు వడ్డీ రహిత రుణాలను వారి వ్యాపార నిమిత్తం, అభివృద్ధి కోసం పంపిణీ చేశామన్నారు. గత ఏడాది 14న ప్రారంభమైన సొసైటీ ఆధ్వర్యంలో దాదాపుగా రూ.31,54,700 రుణాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఇమామ్ మౌలానా, రహంతుల్లా, జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, ఆసిఫ్, నూరుల్, భద్రుజా పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల సెక్టోరియల్ అధికారి

రుద్రవరం: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహనకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను సోమవారం ఎన్నికల సెక్టోరియల్ అధికారి గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ తహసీల్దారు మహబుబ్ బాషా, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు వెంకటరమణ, కాంత్‌లతో మాట్లాడి వివరాలు సేకరించారు. 39 మంది ఉపాధ్యాయులు, 789 మంది పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, వారికి తగిన వసతులపై అడిగి తెలుసుకున్నారు. గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, టేబుళ్ల ఏర్పాటు, బయట తాగు నీరు, మరుగుదొడ్లు వంటి వసతులు సిద్ధం చేయాలని వారికి సూచించారు.

విద్యార్థినికి సత్కారం



విద్యార్థినిని సన్మానిస్తున్న నౌమాన్

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ గ్లోబల్ వార్మింగ్ అంశంపై ప్రతిభ చాటిన ముల్లాన్ పేట ఉర్దూ పాఠశాల విద్యార్థిని సుమయను ఏపీ ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీస్తాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అజీజ్, జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు అబ్దుల్ సమ్మద్, ఉపాధ్యాయినులు షాజిదా, ఉమేమాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు షూ పంపిణీ



క్రీడాకారులకు షూ పంపిణీ చేసిన దృశ్యం

నంద్యాల(సిటీ): మున్సిపల్ హైస్కూల్ క్రీడాకారులకు సోమవారం షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీజీ పాఠశాల హెచ్ఎం జీవలత, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, ఏపీ హాకీ ప్రెసిడెంట్ చెన్నాకే రాజు, కోచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్లాస్టిక్ ముప్పే

- పల్లెల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- పట్టించుకోని అధికారులు

మానవ మనుగడకు ప్లాస్టిక్ పెను ముప్పుగా మారుతుంది. విచ్చలవిడిగా కవర్లు వాడి ఇక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో భూకాలుష్యం పెరుగుతోందరి పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా ఒకరూ లెక్క చేయడం లేదు. ఇక వాటి నిషేధానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంతో వీటి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది.



అయ్యలూరుమెట్ట సమీపంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

నంద్యాల(రూరల్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంది. నంద్యాల పట్టణంలో ప్లాస్టిక్ అమ్మకాలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా, పల్లెల్లో మాత్రం చర్యలు శూన్యం. ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచులను నిషేధించాలని గ్రామాల్లో ఎక్కడా అవగాహన సదస్సులు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వందల ఏళ్ల పడుతుంది. ఒక ప్లాస్టిక్ నీళ్ల సీసా భూమిలో కలవడానికి దాదాపు 450 ఏళ్ల పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూ కాలుష్యాన్ని తగ్గిద్దామని ప్రత్యామ్నాయంగా వీటిని తగలబెడితే తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతుంది.

ఆచరణ ఏదీ?

గ్రామాల్లో కొందరు విద్యావంతులకు ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పుపై అవగాహన ఉన్నప్పటికీ వినియోగం మాత్రం తగ్గించడం లేదు. ప్రజలు చాలా వరకు ప్లాస్టిక్ వినియోగానికి అలవాటు పడిపోయారు. గతంలో అంగడిలో సరుకులు కొనేందుకు ఇంటి నుంచే చేతి సంచులు తీసుకెళ్లేవారు. కానీ నేడు మార్కెట్‌లో సరుకులు కొనుక్కొని ప్లాస్టిక్ కవర్లలో వాటిని ఇంటికి తీసుకొచ్చేందదుకు ఆసక్తి చూపుతున్నారు. నార, గుడ్డ సంచులు అక్కడక్కడా కనిపిస్తున్నా పెద్దగా వినియోగించడం లేదు.

ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలు

- నదులు, చెరువుల్లో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలను చేపలు తిని మరణిస్తున్నాయి. వీటిని తిని ప్రజలు రోగాల పాలవుతున్నారు.
- ప్లాస్టిక్ పేట్లు, గ్లాసులలో వేడి ఆహారం, పానీయాలు తీసుకోవడం వల్ల ప్లాస్టిక్ కరిగి మన శరీరంలోకి వెళ్లడంతో చర్మ, జీర్ణకోశ సమస్యలు, థైరాయిడ్, గొంతు నొప్పులు వస్తున్నాయి.
- ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల వాయుకాలుష్యం జరిగి శ్వాసకోశ వాధ్యులు వస్తాయి.
- భూమి పొరల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో భూసారం తగ్గడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితమవుతాయి.

ప్లాస్టిక్ అనర్థాలను ప్రజలకు వివరించాలి



గతంలో ప్లాస్టిక్ వినియోగం కేవలం పట్టణాలకే పరిమితంగా ఉండేది. నేడు గ్రామాల్లోని ప్రజలు కూడా విపరీతంగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు తెలియడం లేదు. అధికారులు అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్‌ను నిషేధించకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
– ఉమామహేష్, చాబోలు,నంద్యాల మండలం

నిషేధానికి చర్యలు



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ నిషేధానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించాం. త్వరలోనే గ్రామాల్లో సర్పంచ్‌లు, అధికారుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. పల్లెల్లో ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న అంగళ్లు, హోటళ్లపై దాడులు నిర్వహిస్తాం. – భాస్కర్, ఎంపీడీఓ, నంద్యాల

భవన నిర్మాణాల పరిశీలన

గోస్పాడు: మండలంలోని గోస్పాడు, జిల్లెల్ల గ్రామాల్లో చేపడుతున్న భవన నిర్మాణాలను పంచాయతీ రాజ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లీనిక్‌లతో పాటు ఇతర భవనాలను ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మంజూరు చేసిందన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలు చేపడుతున్న భవనాలను వెంటనే పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

విధుల పట్ల అలసత్వం వద్దు

గోస్పాడు: విధుల పట్ల అలసత్వం ప్రదర్శించకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని డిప్యూటీ తహసీల్దార్లు శేఖర్, రామచంద్రారావులు సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వారు సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. స్పందనకు వచ్చే రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు.

పోస్టర్లు తొలగింపు

ఉయ్యాలవాడ: రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోనిబంధనల ప్రకారం ఎన్నికల అధికారులు తులసీక్రిష్ణ, కొండయ్య, దస్తగిరి, దాదాసాహెబ్ పోస్టర్లను తొలగించారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎరువుల దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్‌ను తొలగించారు. మాయలూరులో 3, హరివరంలో 1 చోట ఏర్పాటు చేసిన పోస్టర్లను తొలగించారు.

'పెట్టుబడుల' సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: రాష్ట్రానికి త్వరలో రూ.13 లక్షల కోట్ల పెట్టబడులు రానున్నాయని, వాటి ద్వారా 6 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పెట్టుబడులు రావాడానికి కారకుడైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న దిగ్గజ కంపెనీల నిర్వాహకులు విశాఖ వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు 352 ఎంఓయూలు చేసుకోవడం ముఖ్యమంత్రి చూపిన దృఢమైన నిబద్ధత కారణమన్నారు. రాష్ట్రంలో సానుకూల వ్యాపార పరిస్థితులు ఏర్పడటంతోనే పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మరియమ్మ, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

భూ రీసర్వే త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): మున్సిపాటిటీ పరిధిలోని సమగ్ర భూసర్వే-భూరక్ష పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి హక్కు దారులకు టైటిల్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయాలన్నారు. ఆస్తులకు సంబంధించి అసెస్‌మెంట్లను రీసర్వేలో పరిశీలించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్తులను గుర్తించి వాటిని పరిరక్షించాలన్నారు. ఖాళీ స్థలాల బకాయి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నరసింహమూర్తి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ రాణెమ్మ పాల్గొన్నారు.

- మున్సిపల్ టౌన్‌హాల్‌లో సోమవారం బీఎల్‌ఓ, ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో సుమారు 13,500 మంది పట్టభద్రులు 1,600 మందికి పైగా టీచర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. వీరందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎన్నికల డీటీ రామనాథరెడ్డి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మలు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ ప్రాకారంలో వైభవంగా ఉత్సవం చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కళాశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలను అధిక మెజారిటీతో గెలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు అమీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగం వెంకటేశ్వరరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేటెడ్ ప్రెసిడెంట్ భార్గవ తదితరులు పాల్గొన్నారు. అలాగే దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి చాకరాజువేముల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని భూమా చెంచిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు.

– నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ బల పరిచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరుతూ రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునిత అమృతరాజ్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో స్వల్పకాలిక ఉపాధి కల్పన కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు సోమవారం తెలిపారు. టైలరింగ్, గృహోపకరణాలను మరమ్మతులు చేసే ఫీల్డ్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు 8వ తరగతి వరకు చదువుకుని, చదువుమానేసిన, ఇతర విద్యార్హతలు కలిగి ఉన్న 15 నుంచి 45 ఏళ్ల వయసున్నవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా శ్రీశైలం ఐటీఐలో సమర్పించాలన్నారు. వివరాలకు సెల్ 9440849850, 9705683537, 9440748448, 7382638904 , 9908993910 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సూర్య తేజం.. చంద్ర ప్రకాశం

- వైభవంగా శ్రీ రామతీర్థ పరశురామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు
- ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనములపై దర్శనమిచ్చిన శ్రీయోగానంద నరసింహస్వామి



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఉభయ దేవేరులతో సూర్య, చంద్రప్రభ వాహనాలను అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రామతీర్థ పుట్లాలమ్మ పరశురామలింగేశ్వరస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం మూలమూర్తులు స్వామి అమ్మవారిని శుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులు భూనీలా సమేత శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వాములను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించి అనంతరం పట్టు పీతాంభరాలతో అలంకరించి కొలువుంచారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై కొలువుంచి మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వామి ఉభయ దేవేరులతో చంద్రప్రభ వాహనం అధిరోహించి మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులను కటాక్షించారు. పూజలు వేదపండితులు పుల్లయ్యస్వామి, ప్రతాప్‌స్వామి, స్థానిక అర్చకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భూనీలా సమేతే శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్ల కల్యాణం నిర్వహించడం జరుగుతుంది. రాత్రి శేష వాహనం సేవలు ఉంటాయి.



చంద్రప్రభ వాహనంపై ఉత్సవమూర్తులు

పోలింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ

నంద్యాల: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై రెండో విడత శిక్షణ నిచ్చినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ కామేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో పోలింగ్ నిర్వహణపై పోలింగ్ అధికారులు, సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు మాన్యువల్ ఓటింగ్ పద్ధతి, బ్యాలెట్ బాక్స్‌ల ఓపెనింగ్, క్లోజింగ్ చేయవలసిన విధానంపై లైవ్ డెమో ద్వారా అవగాహన కల్పించారు. పీఓలకు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణ విధానంపై 20 ప్రశ్నలతో కూడిన పత్రాన్ని ప్రతి అధికారికి అందజేసి, ఆ పరీక్షలో వారు పొందిన మార్కులను బట్టి 10 మార్కుల కన్నా తక్కువ వచ్చిన వారికి తిరిగి శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 49 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్న నేపథ్యంలో బ్యాలెట్ పేపరు పెద్దగా ఉంటుందని, జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 30 ఉన్నాయని, 12 మంది పోటీ చేస్తున్న అభ్యర్థులతో బ్యాలెట్ పేపర్ ఉంటుందన్నారు. మూడు స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు మూడు డివిజన్‌లో ఉన్నాయని, మొత్తం జిల్లాలో 94 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఎగువ అహోబిలంలో మంగళవారం ఉదయం ఉత్సవం, చక్రస్నానం, సాయంత్రం ద్వాదశ ఆరాధనం, పుష్పయాగం, అనంతరం రాత్రి గరుడోత్సవం, అనంతరం తెల్లవారుజామున ధ్వజారోహణం ఉంటుంది. అలాగే దిగువ అహోబిలంలో ఉదయం రథోత్సవం, సాయంత్రం ఉత్సవం నిర్వహించనున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ముగిసిన జేఎన్‌టీయూఏ అంతర కళాశాలల గేమ్స్ మీట్

గూడూరు రూరల్: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే తమలోని నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవచ్చని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్ రంగజనార్దన్ తెలిపారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన యూనివర్సిటీ 11వ అంతర కళాశాలల గేమ్స్‌మీట్ సోమవారం అట్టహాసంగా ముగిసింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి వీసీ రంగ జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ గేమ్స్ మీట్‌లో 48 కళాశాలలకు చెందిన 1,747 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా విద్యానగర్‌కు చెందిన ఎన్‌బీకేఆర్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలవడం అభినందనీయమన్నారు. బాలికల విభాగం బాస్కెట్‌బాల్‌లో ఆర్‌జీఎం(నంద్యాల) జట్టు విజేతగా నిలిచింది.

తర్తూరులో అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు

- వివిధ కేటగిరీల్లో రూ.8.30 లక్షలతో బహుమతులు

జూపాడుబంగ్లా: ఏప్రిల్ 6 నుంచి మూడు రోజులపాటు తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని జాతరలో రూ.8.30లక్షల బహుమతులతో అంతర్ రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, తర్తూరు దేవాలయ చైర్మన్ ప్రతాపరెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం 80బన్నూరు గ్రామంలోని తర్తూరు అలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి ఇంట్లో ఎద్దుల బండలాగుడు పోటీల నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో ఏప్రిల్ 6న అంతర్ రాష్ట్ర సీనియర్స్ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు 8 బహుమతులుగా రూ.3.90లక్షల నగదును అందజేస్తామన్నారు. 7న నిర్వహించే అంతర్ రాష్ట్ర న్యూ కేటగిరీ విభాగంలో 8 బహుమతులకు రూ.2.95లక్షలు, 8న నిర్వహించే పాలపండ్ల ఎద్దుల పోటీల్లో 7 బహుమతులుగా రూ.1.45 లక్షల నగదును విజేతలైన ఎద్దుల యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచులు నాగార్జునరెడ్డి, పీఎం నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదిరెడ్డి రమేష్ రెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, కోసిక తరుణ్‌కుమార్‌రెడ్డి, అమరేశ్వరరెడ్డి, నరసింహయాదవ్, విశ్వనాథరెడ్డి, మద్దిలేటిరెడ్డి(నానిరెడ్డి), మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారిత సాధించాలి

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలని అయుర్వేద వైద్యాధికారి లావణ్య, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ రాజేశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య, రాజేశ్వరి, మహిళ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

డ్రైనేజీ పనులు వేగవంతం



క్రిష్టిపాడులో డ్రైనేజీ నిర్మాణ పనులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రూ.16 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన నిధులతో పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ బుడ్డారెడ్డిగారి శివరామిరెడ్డి తెలిపారు.